క్లుప్తంగా

కాల్వలపై ఆక్రమణలను తొలగించండి



తెనాలి అర్బన్: కాల్వలపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులను ఆదేశించారు. 14వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను గురువారం ఆమె పరిశీలించారు. మురుగు కాల్వలపై చిరు వ్యాపారాలు నిర్వహించడాన్ని గమనించిన ఆమె వెంటనే వాటిని తొలగించాలన్నారు. కాల్వలపై వీటిని ఏర్పాటు చేయడం వలన పూడికతీత పనులు చేయడం కష్టసాధ్యంగా మారిందన్నారు. ప్రజలందరూ మురుగు కాల్వలపై ఎటువంటి వస్తువులను పెట్టవద్దని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు, ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా ఏసుబాబు, టీపీవో సాంబశివరావు, ఇన్‌చార్జి ఏఈ జానీబాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అన్ని యూనిట్లు పనిచేసేలా చూడండి



తెనాలి అర్బన్: కంపోస్టు యార్డులోని అన్ని యూనిట్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పల నాయుడు ఆదేశించారు. బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డును గురువారం ఆయన పరిశీలించారు. వ్యర్థాల తరలింపుపై ఆరా తీశారు. అలాగే వర్మీ కంపోస్టు, బయోగ్యాస్, కోకోపిట్, ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వాటిలో ఎస్ఎఫ్‌టీపీ, బయోగ్యాస్ ప్లాంట్‌లు రిపేర్లో ఉన్నాయని ఆయన తెలిపారు. వాటికి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా ఏసుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వేద పరీక్షలో ప్రతిభ చాటిన తెనాలి విద్యార్థి



తెనాలి: తెనాలిలోని 'శ్రీవారి సన్నిధి'లో జరిగిన శ్రీకంచి వేద వేదాంత శాస్త్ర సభ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బుధవారం తిరుపతి కంచిమఠంలో కంచి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామి పట్టాలను ప్రదానం చేశారు. 'తెనాలి పరీక్ష'గా వ్యవహరించే ఈ పరీక్ష భాగవతుల ఆంజనేయశర్మ నేతృత్వంలో ఏటా రెండు సెమిస్టర్ల చొప్పున జరుగుతుంది. గత జూన్‌లో జరిగిన పరీక్షలో 11 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో పట్టణ పరిధి పినపాడుకు చెందిన నోరి కేదారేశ్వరశర్మ ఒకరు. ఈయన బెనారస్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్న కుప్పా బిల్వేష్ శర్మ శిష్యుడు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఈయన శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామి నుంచి పట్టాను అందుకున్నారు. కేదారేశ్వరశర్మకు పట్టణానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

ట్రై సైకిళ్లు పంపిణీ



తెనాలి అర్బన్: వ్యాపారి గుమ్మడి వెంకటనారాయణరావు కుమారుడు పూర్ణచంద్ పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం సాయంత్రం రెండు ట్రై సైకిళ్లను దివ్యాంగులకు తెనాలిలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో రావూరి శ్యామ్‌బాబు, చిగురుపాటి సుబ్బారావు, కుర్రా శ్రీనివాసరావు, వాకా సుబ్బారావు, కె.శ్రీనివాస్, టి.పోతురాజు, టి.చంటి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు లేకుంటే జరిమానా

ఫిరంగిపురం: వాహనచోదకులు తప్పనిసరిగా తమ వెంట ధ్రువీకరణ పత్రాలు తీసుకువెళ్ళాలని సీఐ శివరామకృష్ణ అన్నారు. మండల శివారులోని పెట్రోలు బంకు సమీపంలో గురువారం వాహనాల తనిఖీలు చేశారు. వాహన లైసెన్సు, ఇన్సూరెన్సు, పొల్యూషన్ వంటి ధ్రువపత్రాలు లేకుంటే జరిమానా విధించక తప్పదని హెచ్చరించారు. అనంతరం వాహనాలు తనిఖీలు చేసి సరైన ధ్రువపత్రాలు లేని వాహనాల యజమానులకు జరిమానా విధించారు. ఆయన వెంట ఎస్ఐ బి.శ్రీనివాసరావు, ఏఎస్ఐ పఠాన్ జాన్‌ఖాన్, సిబ్బంది ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ప్రయోజనం



ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో సర్టిఫికెట్లు అందజేస్తున్న కార్యదర్శి శ్రీనివాస్



జిల్లా వైద్యశాలలో మాట్లాడుతున్న డాక్టర్ రామాంజనేయులు



గుప్తా కళాశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధ్యాపకులు

తెనాలి అర్బన్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో తీసుకొచ్చిన మార్పుల వలన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, పీడియాట్రిక్ వైద్యులు డాక్టర్ రామాంజనేయులు పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యశాలలో జీఎస్టీ టు పాయింట్ జీరోపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వలన ఔషధాలు, ఆరోగ్య బీమా వంటివి అందరికీ అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ నరేంద్ర సింగ్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి, జిల్లా ఫార్మసీ సూపర్‌వైజర్ ఝాన్సీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

- బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో నూతన జీఎస్టీ విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేలపాడు పంచాయతీ కార్యదర్శి జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరూ ఎక్కువగా ఉపయోగించే స్టేషనరీ, ఎలక్ట్రానిక్ పరికరాలపై జీఎస్టీ తగ్గిందని చెప్పారు. దీనిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సమావేశంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ టి.జ్యోతిబస్, కె.కళ్యాణ్ చక్రవర్తి, భార్గవి, నందగోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.
- బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ చంద్రకళ పీజీ కళాశాల, గుప్తా ఫార్మసీ కళాశాలలో జీఎస్టీపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిన వస్తువుల వివరాలను తెలియజేశారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.దుర్గారావు, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.నరేష్, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆసియా, మేనేజర్ డి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి వి.శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేద మధ్య తరగతి వర్గాలకు లాభం

తెనాలి రూరల్: జీఎస్టీలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలు పేద, మధ్యతరగతి వర్గాలకు లాభదాయకమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గుంటూరు డివిజన్-1 వాణిజ్యపన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాసరావు, గుంటూరు డివిజన్-2 డిప్యూటీ కమిషనర్ జి.మురళి కృష్ణ, తెనాలి అసిస్టెంట్ కమిషనర్ వి.ముత్యాలరావు, నన్నపనేని సుధాకర్, పెండేల వెంకట్రావు, అనంతాచార్యులు, వర్తక వాణిజ్య విభాగం అధ్యక్షుడు కె.హరికిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్‌లో ఎక్సలెన్స్ సెంటర్



ఎక్సలెన్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న శరవణ కుమార్

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగంలోని ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్ లేబొరేటరీని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్'గా అప్‌గ్రేడ్ చేసినట్లు వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేఎల్‌యూ, మలేషియాలోని యూనివర్సిటీ మలయా, కౌలాలంపూర్ మధ్య దీర్ఘకాలిక అకడమిక్ భాగస్వామ్యానికి ఇది కొత్త దశగా నిలిచిందన్నారు. ఈ సెంటర్‌ను మలేషియా కాన్సుల్ జనరల్ శరవణ కుమార్ కుమరవసగం ప్రారంభించారని, యూనివర్సిటీ మలయా నుంచి ప్రొ. డాక్టర్ వాన్ హలిజా బింటి అబ్, ఎల్డిఎంఆర్సీ హెడ్ మజీద్, ప్రొఫెసర్ థమిల్సెల్వి వెలాయుధం హాజరయ్యారని పేర్కొన్నారు. సంయుక్త పరిశోధనా బృందానికి డాక్టర్ వివేకానందన్, డాక్టర్ అరుణ్ మెహెతా కన్వీనర్లుగా వ్యవహరించారు. వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ హవీష్ ప్రసంగించారు. అనంతరం మలేషియా కాన్సుల్ జనరల్ శరవణ కుమార్‌ను వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వీసీలు డాక్టర్ వెంకటరామ్, డాక్టర్ ఏవీఎస్‌ప్రసాద్, డాక్టర్ రాజశేఖర్ సత్కరించారు.

ఇళ్ల స్థలాల అర్జీల స్వీకరణ

తాడేపల్లి రూరల్: సీతానగరం బోటుయార్డు ఎదురుగా ఉంటున్న పేదల నుంచి సీపీఎం నాయకులు గురువారం అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఎన్నికల ముందు నారా లోకేష్ పేదలకు రెండు సెంట్ల స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17వ తేదీ ఎంటీఎంసీ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో పేదలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. బోటుయార్డు వద్ద 11 ఏళ్లుగా తాత్కాలిక స్థలాల్లో అనేక ఇబ్బందులు పడుతూ ఉంటున్న పేదలకు ప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కేఎల్‌రావు కాలనీ కార్యదర్శి కట్టమేరి తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడిని ఖండించండి

తాడేపల్లి రూరల్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, అభ్యుదయవాదులు ఖండించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి కోరారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మనువాద భావజాలం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.

డివిజన్ స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు డివిజన్ స్థాయి క్రీడాపోటీలకు గురువారం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇ.అరుణశ్రీ మాట్లాడుతూ గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన తాడేపల్లి మండల స్థాయి క్రీడా పోటీలు, సెలక్షన్లు పెనుమాకలో నిర్వహించారని తెలిపారు. అండర్ 17 బాలికల విభాగం.. కబడ్డీలో టి. శ్రావ్య, సీహెచ్ సిరివెన్నెల, ఖోఖోలో ఎస్. కావ్య, జి. మౌనిక ఎంపికయ్యారని పేర్కొన్నారు. బాలుర విభాగం.. ఖోఖోలో కె.శశాంత్, ఎం.సంతోష్, వాలీబాల్ విభాగంలో పి. వెంకట్, అండర్ 14 బాలికల విభాగం.. ఖోఖోలో యశస్విని, బాలుర విభాగం కబడ్డీలో పి. సాత్విక్, డి. చేతన్, ఖోఖోలో కె.నిఖిల్, అక్షయ బాబు, చేతన్, పి.సాత్విక్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను పాఠశాల పి.డి. ఎం. సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయులు, లాల్‌చంద్, భవాని, సుబ్బారావు తదితరులు అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం



పాఠశాల ఉపాధ్యాయులకు రూ.లక్ష అందజేస్తున్న దాత ముప్పవరపు కృష్ణారావు

తాడికొండ: క్రీడలతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసాన్ని పెంపొందించవచ్చని చార్టెడ్ అకౌంటెంట్ ముప్పవరపు కృష్ణారావు అన్నారు. గురువారం తుళ్ళూరు మండలం మందడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థిగా దాని సర్వతోముఖాభివృద్ధికి పాటుపడటం తన బాధ్యత అన్నారు. పాఠశాలలో క్రీడా సామాగ్రి కొనుగోలు నిమిత్తం రూ.40 వేలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిఫాం కొనుగోలుకు రూ.60 వేలు కలిపి మొత్తం రూ. లక్ష వితరణ అందజేశారు. పీ-4లో భాగంగా తాను నలుగురు విద్యార్థులను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో హెచ్ఎం తుర్లపాటి నగేష్, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కేఎల్‌యూలో జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేఎల్‌యూ ఆచార్యులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవం సమ్యక్ 2025 వేడుకలను ఈ నెల 10,11 తేదీల్లో రెండు రోజుల పాటు జరుగనున్నాయని వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథివర్మ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల నుంచి ఆయా కళాశాలలు, యూనివర్సిటీలకు చెందిన సుమారు 25 వేలకు పైగా విద్యార్థులు హాజరు కానున్నారని వివరించారు. సమ్యక్ 2025 చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రదర్శనలో 450కు పైగా విద్యార్థులు ప్రాజెక్టులు, అత్యాధునిక ఆవిష్కరణలను, పరిశోధనలను ప్రదర్శించే వాస్తవ, ప్రపంచ నమూనాలను ప్రదర్శించనున్నామని తెలిపారు. 3 వేలకు పైగా పరిశోధనా పత్రాలు, పోస్టర్లను ప్రదర్శించనున్నారని, హ్యాకథాన్‌లు, కేస్ సవాళ్లు, నిపుణుల చర్యలు, హ్యాండ్స్ ఆన్ మేకర్ సెషన్‌లతో కూడిన 256 సాంకేతిక వర్క్‌షాపులతో పాటు వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం సాంకేతిక సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌డి డీన్ డాక్టర్ బీటీపీ మాధవ్, సమ్యక్ 2025 కన్వీనర్లు ప్రిన్సిపల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్ వి.రాజేష్, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్‌బాబు, ఎఫ్ఈడీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించాలి

మంగళగిరి టౌన్: అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ట్రంప్ సుంకాలు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం అంశంపై పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత దేశంపై విధించే సుంకాలపై, ప్రధాన మంత్రి అవలంబిస్తున్న లొంగుబాటు విధానంపై ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. విధించిన సుంకాలతో దేశంలో రొయ్యలు, చేపలు, పత్తి, వస్త్ర వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. దీంతో ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. మంగళగిరిలో నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. దీనిపై ఈనెల 17న ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దీనికి పేదలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వ్యవస్థల్లో ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారు ఉన్నారన్నారు. ఇలాంటి తరుణంలో భారత రాజ్యాంగానికి, న్యాయవ్యవస్థకు తూట్లు పొడిచేందుకు బీజేపీ చూస్తోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఓట్ల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం చూస్తోందన్నారు.

11న నృసింహ సదనం మొదటి అంతస్తు ప్రారంభం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా నియమితులైన బుచ్చి రాంప్రసాద్ చేతులమీదుగా ఈ నెల 11వ తేదీన నృసింహ సదనం మొదటి అంతస్తు ప్రారంభోత్సవం జరగనుంది. అనంతరం చైర్మన్ ఆత్మీయ అభినందన సభను తెనాలిలోని వేదిక్ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు నాజరుపేటలోని శ్రీవిద్యాశంకర భారతి నృసింహ సదనంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కోశాధికారి తిరుమలరావు, ఉపాధ్యక్షులు కుందేటి వెంకటసుబ్రహ్మణ్యం, మేడూరి శ్రీనివాసమూర్తి, సంయుక్త కార్యదర్శి మేళ్లచెరువు అనిల్ కుమార్, టి.ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు నందివెలుగు రామకృష్ణశర్మ, ఎల్లాప్రగడ పద్మజ, కొడవటిగంటి కమలేంద్ర కుమార్, చింతలపాటి సీతారామశాస్త్రి పాల్గొన్నారు.

రెండు నెలల పెండింగ్ జీతాలు చెల్లించండి

కార్మికుల నిరసన



నిరసన తెలియజేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

తాడికొండ: తమకు పెండింగ్‌లో ఉంచిన రెండు నెలల పారిశుద్ధ్య కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని రాజధాని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పని విరామ సమయంలో పలు గ్రామాల్లో వారు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాజధాని పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ పెండింగ్ జీతాల కోసం ఆందోళన చేయడం, ఆ తర్వాతనే అధికారులు జీతాలు చెల్లించడం ఆనవాయితీగా మారిందని చెప్పారు. మూడో నెల జరుగుతున్న ఇప్పటివరకు రాజధాని అమరావతి స్మార్ట్ సిటీ లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోగా మీటింగ్ ల పేరుతో వివిధ గ్రామాలలోని పారిశుద్ధ్య కార్మికులందరిని ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఇద్దరు కార్మికుల పని ఒక్కరి మీదే పడటంతో ఉన్న కార్మికులు కూడా పనిచేయలేక మానేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. జీతాల చెల్లింపు కోరుతూ ఈనెల 10వ తేదీ శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయం వద్ద జరిగే గ్రీవెన్స్‌లో రాజధాని పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి సామూహిక రాయబారం నిర్వహించి, అధికారులకు అర్జీ అందజేయనున్నట్లుగా తెలిపారు. నిరసనలో పలువురు కార్మిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

కొల్లిపర: మండల పరిధిలోని తూములూరు, కొల్లిపరలలో వీధి కుక్కల దాడిలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. దీనిపై బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తూములూరు గ్రామ శివారు యాదవపాలెంకు చెందిన మహిళ, బాలిక, కొల్లిపర గ్రామానికి చెందిన బసవ పున్నారెడ్డి, గంగోత్రి , శివయ్య తదితరులపై కుక్కలు దాడి చేశాయి. దీంతో తీవ్ర గాయాలతో కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వీధి కుక్కలు ఎక్కువయ్యాయని చెప్పారు. తహసీల్దార్, ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలని కోరారు. తూములూరు, హనుమాన్ పాలెం, దావులూరు, కొల్లిపర గ్రామాల్లో కొన్ని రోజులుగా వీధి కుక్కల దాడులతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు, కొల్లిపర గ్రామంలో వారం నుంచి సుమారు ఐదుగురు గాయాలు పాలయ్యారు. బుధవారం మరో వ్యక్తిపై కుక్కలు దాడి చేయటంతో ప్రజలు బయటికి రావాలంటే భయపడుతున్నారు. కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ రేబీస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని చెప్పారు.

సంపూర్ణ పారిశుద్ధ్యానికి చర్యలు



కార్యదర్శుల సమావేశంలో సూచిస్తున్న ఎంపీడీవో సమతావాణి

తాడికొండ: గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం దిశగా తగిన చర్యలు తీసుకోవాలని తాడికొండ ఎంపీడీవో సమతావాణి సూచించారు. గురువారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జీఎస్టీ 2.0కు సంబంధించిన క్యాంపెయిన్‌ను ప్రతి పంచాయతీలో నిర్వహించి కేంద్రం తగ్గించిన జీఎస్టీతో సామాన్యులకు జరిగే లాభాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మండలంలో ఉపాధి సోషల్ ఆడిట్ టీం పరిశీలన, గ్రామసభల ప్రక్రియ పూర్తైందని, మండల పరిషత్ కార్యాలయంలో పబ్లిక్ హియరింగ్‌లో సోషల్ ఆడిట్ నివేదికను వెల్లడించే అవకాశం ఉండటంతో అందరూ హాజరు కావాలని సూచించారు. ఈ నెల 13, 15, 17 తేదీల్లో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, గ్రీన్ అంబాసిడర్‌లు, స్వయం సహాయక బృందాల సభ్యులకు మండల పరిషత్ కార్యాలయంలో సంపూర్ణ శిక్షణ అందించనున్నారు కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవో ఆర్డీ అరుణ్ కుమార్, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి కొత్త సొబగులు

రేపు గాలిగోపురం, కలశ ప్రతిష్ఠాపన



దేవాలయం



శ్రీలక్ష్మీసమేత శ్రీనరసింహ స్వామి



శ్రీఅభయ వీరాంజనేయస్వామి

తెనాలి: పట్టణ నాజరుపేటలోని శతాబ్దానికిపైగా చరిత్ర కలిగిన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం కొత్త సొబగులు అద్దుకుంది. అందులో భాగంగా గాలిగోపురం, కలశ ప్రతిష్ఠాపన మహోత్సవం ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నారు. శ్రీశృంగేరీ శ్రీవిరూపాక్ష శ్రీపీఠపాలిత శ్రీపరశివానంద భారతిస్వామి చేతులమీదుగా ఉదయం 9.09 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవం జరగనుంది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుంది. ఈ ఆలయం భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతోంది. తెనాలి ప్రాంతంలో ప్రాచీన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఇదొక్కటే కావటం విశేషం.

ఇదీ చరిత్ర...

1906లో స్థానికుడైన పొన్నాడ వెంకట లక్ష్మీనరసింహం ఈ ఆలయాన్ని నిర్మించారు. అప్పట్లో ఈ ప్రాంతాన్ని లక్ష్మీనరసింహపేటగా పిలుచుకునే వారు. ఆ ప్రాంతం అభివృద్ధి చెందాక స్థానికుల ఆకాంక్ష ప్రకారం తెనాలి మున్సిపల్ కౌన్సిల్ వారు నాజరుపేటగా నామకరణం చేశారు. తర్వాత పొన్నాడ వెంకట లక్ష్మీనరసింహం, జయంతి కాకుళయ్యలు శ్రీలక్ష్మీనరసింహస్వామి, శ్రీఅభయ వీరాంజనేస్వామి మూలవిరాట్‌లను ప్రతిష్ఠించారు. పొన్నాడ రామకోటి సోమయాజులు ఇక్కడి స్వామి వార్లకు మందిరం నిర్మించారు. 1963–64లో ప్రాకారం సమకూరింది. ఆలయానికి అనుబంధంగా చిన్న కల్యాణమండపం ఉంది.

పీఠానికి బాధ్యతలు

1975లో ఆలయ నిర్వహణ బాధ్యతను శ్రీశృంగేరీ శ్రీవిరూపాక్ష పీఠానికి అప్పగించారు. పీఠం పర్యవేక్షణలో ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో ఆలయ కార్యకలాపాలు కొనసాగుతుంటాయి. ఆలయంలో శ్రీలక్ష్మీ సమేత శ్రీనరసింహస్వామి కొలువై ఉన్నారు. అభిముఖంగా శ్రీఅభయ వీరాంజనేయ స్వామి కొలువుదీరారు. సింహాచలం క్షేత్రంలో జరిగినట్టే ఇక్కడ కూడా చందనోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం ప్రత్యేకత. స్వామి వారి నక్షత్రమైన స్వాతి నక్షత్రంరోజున ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయి. అన్ని పర్వదినాల ఉత్సవాలు చేస్తున్నారు. భక్తులతో ఆలయం సందడిగా ఉంటుంది.

చకచకా అభివృద్ధి పనులు

ప్రస్తుత ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కె.చంద్రశేఖరరెడ్డి నేతృత్వంలో ఆలయం అభివృద్ధి వేగం పుంజుకుంది. పక్కనే ఉన్న కల్యాణ మండపానికి శ్లాబు వేయించి ఆలయానికి ఆదాయ వనరుగా మార్చారు. ఫ్లోరింగ్, లైటింగ్ ఏర్పాటు చేయించారు. గర్భగుడి రెనోవేషన్ మరో ప్రత్యేకతగా చెప్పవచ్చు. ఆలయానికి పశ్చిమం వైపున ధ్వజస్తంభం వైపు, ఉత్తరం దిశగా గల రోడ్డు నుంచి ప్రవేశద్వారాలు ఉన్నాయి. తూర్పు ఈశాన్యంగా ప్రవేశద్వారం లేదనే లోటును తీర్చేందుకు, అటువైపుగా ఇప్పుడు గాలిగోపురం నిర్మించారు. ప్రవేశానికి ఇక్కడా అవకాశం కల్పించారు. దాతల సహకారంతో నిర్మించిన గాలిగోపురంపై కలశ ప్రతిష్ఠాపన చేయనున్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

స్వచ్ఛ గ్రామాల కోసం కృషి అవసరం



తెనాలి టౌన్: స్వచ్ఛ గ్రామాల పరిరక్షణకు ప్రజలు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగ సాయికుమార్ పిలుపునిచ్చారు. రూరల్ మండలం కొలకలూరు, ఖాజీపేట, హాఫ్‌పేట గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తను జేసీబీలతో ట్రాక్టర్‌లో తరలింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రహదారుల వెంట వ్యర్థాలు వేయవద్దని ప్రజలకు సూచించారు. స్వచ్ఛ పరిసరాలు, గ్రామాల కోసం ప్రజల సహకారం అవసరం అన్నారు. కార్మికులు ఇంటికి వచ్చినప్పుడు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వై.వి.డి.ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ కరిముల్లా, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.